క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సలోమి

దొర్నిపాడు: ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సలోమి కోరారు. మంగళవారం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. గుండుపాపల, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లెకు చెందిన ఎస్సీ, ఎస్టీల సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

నేడు వలంటీర్లకు వందనం

దొర్నిపాడు: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని 136 మంది వలంటీర్లకు బుధవారం అవార్డులు, నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. సేవా వజ్రకు పల్లవి (బుర్రారెడ్డిపల్లె), సేవారత్నకు రామలింగేశ్వరి (కొండాపురం), మానస (గుండుపాపల), నాగార్జున (డబ్ల్యూ గోవిందిన్నె), నాగఅంజనమ్మ (బుర్రారెడ్డిపల్లె), మహేంద్ర(క్రిష్టిపాడు) సహా సేవామిత్రలను స్థానిక వైఎస్సార్ క్రాంతి కార్యాలయంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చేతుల మీదుగా సత్కరిస్తున్నట్లు చెప్పారు.

అనారోగ్యంతో ఏఓ మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

నంద్యాల టౌన్: నంద్యాల జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయ ఏఓ డాక్టర్ చంద్రశేఖర్(52) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొద్ది రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. ఆయన మృతి బాధాకరమని, ఆత్మకు శాంతి కలగాలని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు.

ఈకేవైసీకి నేడు ఆఖరు



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ

శిరివెళ్ల: పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు అన్నారు. మంగళవారం గోవిందపల్లె రైతు భరోసా కేంద్రంలో పీఎం కిసాన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో 5,200 మంది రైతులు పీఎం కిసాన్ కింద లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఇంకా 77 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ నెల 21వ తేదీలోగా రైతు భరోసా కేంద్రాలు, ఆధార్ కేంద్రాల్లో చేయించుకోవాలని సూచించారు. అలాగే భూమి వివరాలకు ఆధార్ లింక్ చేయించుకోవాలని తెలిపారు. ఏఓ సుధాకర్, ఏఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నంద్యాలలో నేడు వలంటీర్లకు సన్మానం

నంద్యాల(సిటీ): నగరంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నంద్యాల పట్టణ పరిధిలోని వలంటీర్లను సన్మానించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రి సహాయనిధి కింద నియోజకవర్గంలో పలువురికి మంజూరైన రూ.3.55 లక్షల చెక్కులను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు ఉన్నారు.

ప్రజాపోరు యాత్రను విజయవంతం చేద్దాం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల నియోజకవర్గంలో బుధవారం నుంచి ప్రజాపోరు యాత్ర ప్రారంభమవుతుందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు గ్రామ, పట్టణ స్థాయిలో ఈ నెల 29వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. బుధవారం కొత్తపల్లె, బిల్లలాపురం, నుగాలిమెట్ట, పెద్దకొట్టాల, అయ్యలూరు గ్రామాల్లో ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ: మండలంలోని శాంతినగరం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఆరుగురికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ నరసింహులు వివరాల మేరకు.. రుద్రవరంకు చెందిన 15 కూలీలు మంగళవారం ఆటోలో కోవెలకుంట్ల మండలం లింగాలకు మిరప కోతలకు వెళ్లారు. తిరుగుప్రయాణంలో శాంతినగరం వద్ద ఆటో టైరు పేలడంతో బోల్తాపడింది. తిరుపతయ్య(40) మృతి చెందాడు. ఆరుగురికి గాయాలయ్యాయి. వారిని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి
- సేవా వజ్ర, సేవారత్నా, సేవా మిత్ర అవార్డుల ప్రదానం



సేవావజ్ర వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి

గోస్పాడు: ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు చేరవేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మైనర్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్ ముక్కమల్ల ప్రహ్లాదరెడ్డితో కలిసి ఎమ్మెల్యే వలంటీర్లను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పారవి మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు సంక్షేమ వారధులుగా నిలిచారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫారసు మేరకు, ఆ పార్టీ వారికి మాత్రమే అందేవని, పేదలకు మొండిచేయి చూపారన్నారు. అలాంటి పరిస్థితి తలెత్తకూడదన్న ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు అమోఘమన్నారు. గోస్పాడు మండలంలో 204 మంది వలంటీర్లు ఉండగా ఒకరికి వజ్ర, ఐదుగురికి సేవారత్నా, 198 మందికి సేవా మిత్ర పురస్కారాలు అందించారు.

వలంటీర్లకు పెంచిన నగదు ప్రోత్సాహకం

వలంటీర్లు అందించిన సేవలకు గాను నగదు ప్రోత్సాహకాన్ని ఈ ఏడాది 50శాతం పెంచిందన్నారు. గతంలో సేవా మిత్రలకు రూ.10వేలు ఇస్తుండగా ఈ ఏడాది రూ.15వేలు, సేవారత్నకు రూ.20 వేల నుంచి రూ.30వేలకు, సేవావజ్ర రూ.30 వేల నుంచి రూ.45 వేలకు పెంచిన ఘనత జగనన్నదని తెలిపారు. అనంతరం వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్థర్ సైమాన్, వైస్ ఎంపీపీ రాజు, సర్పంచ్‌లు ప్రమీళ, సుధామణి, ఐజయ్య, శివరామిరెడ్డి, రాజారెడ్డి, కోటేశ్వరరెడ్డి, మల్లేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు భక్తవత్సల రెడ్డి, భారతి, కల్యాణి, వంగూరి మహేశ్వరమ్మ, ఉపసర్పంచ్ బెక్కెం నాగేశ్వరరెడ్డి, నాయకులు గడ్డం ప్రసాదయాదవ్, శంకర్‌రెడ్డి, భాస్కరరెడ్డి, పార్థరసారథిరెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సేవ చేయడంతోనే గుర్తింపు



ప్రజలకు సేవ చేయడంతోనే గుర్తింపు వచ్చింది. అధికారులు నాకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నా. సేవా వజ్ర అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ఇకపై రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తా. –కృష్ణయ్య, వలంటీర్, దీబగుంట్ల

బాధ్యతగా భావించి పనిచేశా



సంక్షేమ పథకాలను ప్రజల ఇంటిముంటకు చేరవేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. దీనికి అనుగుణంగా బాధ్యతగా భావించి పనిచేస్తున్నాను. ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రోత్సాహంతోనే మా పరిధిలోని లబ్ధిదారులకు సేవలందించాను. గుర్తించి సేవా వజ్ర అవార్డుతో సత్కరించడం సంతోషంగా ఉంది.

–బాషా, వలంటీర్, సాంబవరం


ఆనందంగా ఉంది



ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నా. ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం కోసం కాకుండా సామాజిక సేవా దృక్పథంతో పనిచేస్తున్నా. ఈ సేవతో నాకెంతో సంతోషంగా ఉంది. సేవమిత్ర అవార్డు లభించింది.

–మనోజ్‌కుమార్‌రెడ్డి, వలంటీర్, గోస్పాడు

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



పూజలందుకున్న శ్రీకాళికాంబ అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లోని శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతం, నిమ్మ, వేప రసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం, 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ చేశారు. మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

23న వాహనాల వేలం

బొమ్మలసత్రం: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఈనెల 23వ తేదీ వేలం వేయనున్నట్లు నంద్యాల సెబ్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న సెబ్ పోలీస్టేషన్‌లో వేలంపాట జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు సెబ్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

- తెళ్లపురిలో రూ.4.75 కోట్లతో లింగాల–నంద్యాల రహదారి ప్రారంభం
- రాయపాడులో రూ.40 లక్షలతో తాగునీటి సమస్యకు పరిష్కారం



తెళ్లపురిలో భూహక్కు పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

గోస్పాడు: ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాయపాడు, తెళ్లపురి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. శిల్పారవి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పేదల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. వీటితో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, సీసీరోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి వసతులను కల్పించిందని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే ఎంతో వ్యయప్రయాసాలు పడాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా ప్రజల ఇళ్లవద్దకే అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి సమస్యల పరిష్కారం చేసుకున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలవాలని కోరారు.

రూ.5.15 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

మండలంలోని తెళ్లపురి, రాయపాడు గ్రామాల్లో మంగళవారం రూ.5.15 కోట్లతో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. రాయపాడు గ్రామానికి నీటి సమస్య తీర్చేందుకు రూ.40 లక్షలతో 2కి.మీ దూరంలో బోరు ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా గ్రామంలో వాటర్ సప్లయ్ పంప్‌హౌస్ బోరును ఏర్పాటు చేశారు. అలాగే పంచాయతీ కార్యాలయ మరమ్మతు పనులు, కాంపౌండ్ గోడలను నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అలాగే తెళ్లపురిలో రూ.4.75 కోట్లతో లింగాల–నంద్యాల రహదారిని ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని 93 మందికి పట్టాలను పంపిణీ చేశారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి, మైనర్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్ ముక్కమల్ల ప్రహ్లాదరెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, సర్పంచ్‌లు యాసం రామేశ్వరమ్మ, సుధామణి పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

వంతెన నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

రుద్రవరం: మండల పరిధిలోని పేరూరు గ్రామ సమీపంలో ఉన్న వకిలేరు వాగుపై వంతెన నిర్మాణానికి నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఏపీ జలవనరులశాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మంగళవారం భూమి పూజ చేశారు. పేరూరు నుంచి శిరివెళ్ల వైపు వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామపెద్దలు వకిలేరు వాగుపై వంతెన నిర్మించాలని గంగుల ప్రభాకర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డికి విన్నవించారు. స్పందించిన వారు సీఎం దృష్టికి తీసుకెళ్లి చందలూరు, చిలుకలూరు, ఎర్రగుడిదిన్నె, పేరూరు గ్రామాల మీదుగా శిరివెళ్ల వరకు నూతన తారురోడ్డు వేయించారు. అలాగే పేరూరు పక్కనే ఉన్న వకిలేరు వాగుపై వంతెన నిర్మించేందుకు రూ.8.93 కోట్లు మంజూరు చేయించారు. ఆ నిధులతో పనులను ప్రారంభించేందుకు భూమి చేశారు. ఎమ్మెల్యే జేసీబీతో స్వయంగా మట్టి తవ్వి పనులను ప్రారంభించారు. శిరివెళ్ల, పేరూరు ప్రజలు ప్రభుత్వానికి, గంగుల కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జెల రాఘవేంద్రారెడ్డి, సర్పంచ్ కోనేటి దేవదానం, ఎంపీటీసీ సభ్యురాలు వసంతమ్మ, నాయకులు తిరుపతిరెడ్డి, క్రిష్టారెడ్డి, బాలనాగిరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా



గోస్పాడు: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



గోడిగనూరులో రక్త పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

గోస్పాడు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు పేదల ఆరోగ్యానికి భరోసానిస్తున్నాయని ఎంపీడీఓ నాగఅనసూయ, ఎంఈఓ అబ్దుల్‌కరీం అన్నారు. మండలంలోని ఎం.కృష్ణాపురం గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు ప్రవీణ్, నర్మద, హుసేని 343 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోటేశ్వరరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

403 మందికి వైద్య సేవలు

చాగలమర్రి: గోడిగనూరు సచివాలయం పరిధిలోని ప్రజలకు ముత్యాలపాడు పీహెచ్‌సీ వైద్యులు షేక్ తస్లీం సుల్తానా ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో సుమారు 304 మంది వైద్య సేవలు పొందినట్లు ఆమె తెలిపారు. సుమారు 42 మందికి రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. అలాగే 20 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని తెలిపారు. ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ ఛీపాటి సంజీవరాయుడు, ఎంపీటీసీ పత్తి నారాయణ, ఎంపీహెచ్ఈఓలు వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు ఆర్థిక భరోసానిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు గంగుల అవంతిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని రామలక్ష్మీ కొట్టాల, కుమ్మరి కొట్టాల వీధుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



రుద్రవరంలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రుద్రవరం: మండలంలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం శిరివెళ్ల సీఐ చంద్రబాబు, ఎస్ఐ నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు, భద్రత వంటి అంశాలపై ఆరా తీసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలోని 51 పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నామని.. ఎలాంటి వసతులు ఉన్నాయో తెలుసుకుని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం

నంద్యాల(సిటీ): నంద్యాలలోని పద్మావతినగర్‌లో రూ. 38 లక్షలతో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, ఏఎస్పీ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. జిల్లా కేంద్రం అయ్యాక ట్రాఫిక్ పెరిగినందున వాహనచోదకులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఎమ్మెల్యే అన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి పాల్గొన్నారు.

జ్వాలానరసింహునికి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రుద్రవరం: తిప్పారెడ్డిపల్లెలో జ్వాలానరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పార్వేట ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తుల పల్లకీ చిలుకలూరు నుంచి సోమవారం రాత్రి తిప్పారెడ్డిపల్లెకు చేరుకుంది. మంగళవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి స్వాగతించారు.

యువకుడి ఆత్మహత్య

ఆళ్లగడ్డ: పట్టణంలోని సాగర్‌వీధికి చెందిన బాషా (35) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యం సేవించి రావడంతో కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. ఈ క్రమంలో వారితో గొడవపడ్డాడు. అందరూ నిద్రకు ఉపక్రమించగా బాషా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి బీబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.

గ్రామాల్లో నీటి సమస్య రానీయొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ ఆర్థర్‌సైమాన్

గోస్పాడు: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ ఆర్థర్‌సైమాన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సైమాన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతో ఖర్చు చేస్తోందని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే గుర్తించి బాగు చేయాలని తెలిపారు. తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ పద్ధతులు తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం అధికారులు ఆయా శాఖల ప్రగతిని ప్రజాప్రతినిధులకు వివరించారు. ఎంపీడీఓ అనసూయ, మండల ఉపాధ్యక్షుడు రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు



ప్రత్యేక అలంకారంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి



భీష్ముడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బెస్త సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): స్థానిక ప్రథమనంది ఆలయంలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో మంగళవారం భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నంద్యాల బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్ హాజరై భీష్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శివ, సెక్రటరీ శ్రీనివాసులు, రామసుబ్బయ్య, రామ్మోహన్, మురళీకృష్ణ, పుల్లయ్య పాల్గొన్నారు.

జగతికి నిర్దేశం భీష్ముని ఉపదేశం

నంద్యాల(వ్యవసాయం): జగతికి నిర్దేశం భీష్ముని ఉపదేశమని వేదపండితుడు మాడుగుల నాగేంద్రశర్మ అన్నారు. మాఘమాసం భీష్మ ఏకాదశి, శ్రీవిష్ణు సహస్ర నామ జయంతిని పురస్కరించుకుని శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో సంజీవనగర్ రామాలయంలో సామూహిక విష్ణు సహస్ర నామ స్తోత్రాన్ని నిర్వహించారు. మహిళలతో సామూహిక కుంకుమార్చన చేయించారు. కార్యక్రమంలో భగవత్ సేవా సమాజ్ సభ్యులు సముద్రాల సూరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానంతో మంచి అవకాశాలు




కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఉపకులపతి

నంద్యాల(న్యూటౌన్): కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకుంటే విద్యార్థులకు మంచి అవకాశాలు వస్తాయని రాయలసీమ యూనివర్సిటీ (ఆర్‌యూ) ఉపకులపతి ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో అదనపు కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక విద్యపై పట్టుసాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ప్రగతిరెడ్డి, కంప్యూటర్ విభాగ సమన్వయకర్త ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథులు.. వలంటీర్లు



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి



రుద్రవరం: సత్కారం అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే

శిరివెళ్ల: ప్రభుత్వ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకు చేరవేస్తున్న సంక్షేమ రథసారథులు వలంటీర్లు అని జలవనరులశాఖ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం శిరివెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని 236 మంది గ్రామ వలంటీర్లకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులందరికీ నవరత్నాల సంక్షేమ పథకాలు చేరాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. ఈ క్రమంలోనే గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.20 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని తెలిపారు. అలాగే 2.23 లక్షల మందిని వలంటీర్లుగా నియమించారని చెప్పారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసి ప్రజల మన్ననలు అందుకుంటున్నారన్నారు. నిష్పక్షపాతంగా ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లపై ప్రతిపక్ష పార్టీలు విషప్రచారం చేయడం సరికాదన్నారు. వలంటీర్ల వ్యవస్థను తప్పుపట్టడం తగదన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న ఈ వ్యవస్థ పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. పొరపాటున బాబు సీఎం అయితే వలంటీర్ వ్యవస్థ, ఇప్పుడున్న పథకాలను రద్దు చేస్తారన్నారు. మళ్లీ జన్మభూమి కమిటీలే రాజ్యమేలుతాయన్నారు. వలంటీర్లు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైఎస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ సలాం, పార్టీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నరహరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, సర్పంచ్ సాలమ్మ, ఉప సర్పంచ్ ఇంతియాజ్, ఎంపీడీఓ ఫణి రాజకుమారి, తహసీల్దార్ కులశేఖర్, సర్పంచ్‌లు సుభహాన్, జింకల నాగన్న, రాఘునాథరెడ్డి, చిన్న నరసింహారెడ్డి, దాదిరెడ్డి తిమ్మారాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం వలంటీర్ల వ్యవస్థ

రుద్రవరం: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో వలంటీర్లుగా సేవలందిస్తున్న 242 మందిలో 5 మంది సేవారత్నాలు, 208 మంది సేవా మిత్ర పురస్కారాలకు ఎంపిక అయ్యారు. సేవారత్నాలను స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎమ్మెల్యే శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. వలంటీర్ల సేవలు అమోఘమని కొనియాడారు. మరింత సేవలు చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, పుట్టాలమ్మ క్షేత్ర కమిటీ డైరెక్టర్ గంగిశెట్టి తిమ్మయ్య, సచివాలయాల కన్వీనర్ నాగేష్, క్రిష్ణుడు పాల్గొన్నారు.